నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
10 | ఖమ్మం, బుధవారం 22 జనవరి 2025 | BHADRADRI KOTHAGUDEM


కల్లూరులో గ్రామసభలో అధికారులను ప్రశ్నిస్తున్న నాయకులు, గ్రామస్తులు

'ప్రజాపాలన అంటూ గొప్పలు చెప్పారు. అందరికీ పథకాలు అందిస్తామంటూ మాయమాటలు చెప్పారు. మా అందరి దగ్గరా దరఖాస్తులు తీసుకున్నారు. చివరికి గ్రామసభల్లో మాలాంటి అర్హుల పేర్లు లేకుండా చేశారు. డబ్బున్నోళ్లకే పథకాలు ఇస్తారా? ఇళ్లు ఉన్న వాళ్లకే మళ్లీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తారా? గతంలో లబ్ధి పొందిన వాళ్లే ఇప్పుడూ లబ్ధిదారులు ఎలా అవుతారు? మాకు జాగాలు ఉన్నప్పటికీ ఇందిరమ్మ ఇళ్లు ఎందుకు మంజూరు చేయలేదు?'
**–ఇవీ.. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మంగళవారం నాటి గ్రామసభల్లో దరఖాస్తుదారులు వేసిన ప్రశ్నలు.**


పథకాలకు అర్హులను ఎందుకు ఎంపికచేయలేదంటూ చుంచుపల్లి గ్రామసభలో అధికారులను ప్రశ్నిస్తున్న గ్రామస్తులు

**చుంచుపల్లికి చెందిన కోడి ముత్యాలు అనే మహిళ రోడ్డుపై నాలుగు చక్రాల బండి పెట్టుకొని బజ్జీలు విక్రయించుకుంటూ జీవిస్తున్నది. ఆమెకు సొంత ఇల్లు లేదు. అద్దె ఇంట్లో ఉంటూనే కుటుంబాన్ని నెట్టుకొస్తున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన కొత్తలో పెట్టిన ప్రజాపాలన సభల్లో ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేసుకుంది. కానీ.. మంగళ వారం తమ ఊరి గ్రామసభలో ప్రకటించిన లబ్ధిదారుల పేర్లలో ఆమె పేరు లేదు. దీంతో గుండెలోంచి ఉప్పొంగిన బాధతో గ్రామసభలోని అధికారి వద్దకు వెళ్లింది. 'నేను నిరుపేదను కాదా?' అంటూ ప్రశ్నించింది. 'అర్హుల జాబితాలో నా పేరు ఎందుకు రాలేదు?' అంటూ నిలదీసింది. దీంతో అధికారులు ఆమెకు సర్దిచెప్పారు. 'మళ్లీ పేరు రాయించుకో.. ఈసారి వస్తది' అంటూ బుజ్జగించారు.**


అధికారిని ప్రశ్నిస్తున్న కోడి ముత్యాలు

–ఇలాంటి బాధితులు ఒక్కరుకాదు.. ఇద్దరు కాదు.. ఉమ్మడి జిల్లాలో వేల సంఖ్యలో ఉన్నారు. మంగళవారం నాటి గ్రామసభల్లో వెల్లడించిన అర్హుల జాబితాలో తమ పేర్లు లేవంటూ పేదలంతా ఆందోళనలు వ్యక్తం చేశారు. అన్ని అర్హతలూ ఉన్నప్పటికీ తమ పేర్లు జాబితాలో ఎందుకు పొందుపర్చలేదో చెప్పాలంటూ అధికారులను నిలదీశారు. 'మాలాంటి అసలైన పేదలకు ప్రభుత్వం నుంచి ఇందిరమ్మ ఇళ్లు రావా?' అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు.

- జాగా ఉన్న మాకు ఇందిరమ్మ ఇళ్లు ఎందుకు రాలేదు?
- ఇప్పటికే ఇళ్లు ఉన్న వాళ్లకు మళ్లీ ఎలా ఇస్తున్నారు?
- డబ్బున్నోళ్లకే, గత లబ్ధిదారులకే మళ్లీ పథకాలు అందిస్తారా?
- ప్రజాపాలనంటూ గొప్పలు చెప్పారు.. అర్హుల పేర్లు తీసేశారు..
- ఉమ్మడి ఖమ్మం జిల్లా గ్రామసభల్లో ఎక్కడికక్కడ నిలదీతలు
- బోనకల్లులో గ్రామస్తుల తిరుగుబాటు.. చెదరగొట్టిన పోలీసులు
- పలుచోట్ల రసాభాస.. దమ్మపేటలో అర్ధాంతరంగా నిలుపుదల
- దరఖాస్తుదారులకు సమాధానం చెప్పలేక అధికారులు సతమతం
- మరోసారి దరఖాస్తు చేసుకుంటే అందరికీ ఇస్తామంటూ దాటవేత

# మా పేర్లు ఎటుపోయినయ్


ఖమ్మం నగరంలో అధికారులను నిలదీస్తున్న మహిళలు

**ఖమ్మం, నమస్తే తెలంగాణ ప్రతినిధి/ భద్రాద్రి కొత్తగూడెం, నమస్తే తెలంగాణ, జనవరి 21:**

రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలకు లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన గ్రామసభలు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో తొలిరోజు మంగళవారం ప్రారంభమయ్యాయి. నాలుగు రోజుల ప్రణాళికలో భాగంగా మొదటి రోజు ఒక్కో మండలంలో నాలుగు నుంచి ఆరు గ్రామాల్లో అధికారులు గ్రామసభలు నిర్వహించారు. ఈ గ్రామసభలకు మండల, జిల్లాస్థాయి అధికారులను ఇన్‌చార్జులుగా నియమించారు. గ్రామకార్యదర్శులు కన్వీనర్లుగా వ్యవహరించారు. ప్రజాపాలన, మీ సేవ సహా ఇతర మార్గాల ద్వారా ఇప్పటికే స్వీకరించిన దరఖాస్తుల ఆధారంగా అర్హుల జాబితాను తయారు చేసి గ్రామసభల్లో ప్రదర్శించారు. ఉదయం 9 గంటలకు సభలు ప్రారంభమయ్యాయి. అధికారులు జాబితాను చూపించి లబ్ధిదారుల పేర్లు చదివిన వెంటనే అర్హులు ఆగ్రహావేశాలకు లోనయ్యారు. ఆ జాబితాలో తమలాంటి అర్హుల పేర్లు లేకుండా ఇప్పటికే పథకాలు పొందిన అనర్హులు పేర్లు ఎలా ఉన్నాయంటూ అధికారులను నిలదీశారు.

ఖమ్మం జిల్లా ఖమ్మం రూరల్ మండలం గోళ్లపాడు గ్రామసభకు కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ హాజరయ్యారు. భద్రాద్రి జిల్లా చండ్రుగొండ మండలం మద్దుకూరు గ్రామసభలో కలెక్టర్ జితేశ్ వి పాటిల్ పాల్గొన్నారు. తమకు ఇంటి జాగా ఉన్నప్పటికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయలేదని, భూములు ఉన్న వారికి ఆత్మీయ భరోసా వర్తింపజేస్తున్నారని, తాము నిరుపేదలమైనా రేషన్ కార్డుల జాబితాలో మా పేర్లు లేకుండా చేశారని, లబ్ధిదారుల జాబితాలో అనేక అక్రమాలు జరిగాయని ప్రజలు తిరగబడ్డారు.

## గ్రామసభల్లో హోరెత్తిన నిరసనలు..

ఉమ్మడి ఖమ్మం జిల్లావ్యాప్తంగా రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం నిర్వహించిన గ్రామసభల్లో నిరసనలు హోరెత్తాయి. ఇదివరకే స్వీకరించిన దరఖాస్తులు, ఇటీవల చేసిన సర్వేల ఆధారంగా రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ రైతు భరోసా పథకాల అర్హుల జాబితాను ప్రకటించారు. అర్హుల పేర్లను అధికారులు గ్రామసభల్లో చదివి వినిపించారు. ఇదివరకే పథకాలు పొందిన వారి పేర్లు, అనర్హుల పేర్లు ఆ జాబితాలో ఉండడాన్ని గమనించిన అర్హులు, నిరుపేదలు.. అధికారులను ఎక్కడికక్కడ నిలదీశారు. నిరుపేదలమైన తమ పేర్లు అర్హుల జాబితాలో ఎందుకు లేవని? ప్రభుత్వ పథకాలను తమకు ఎందుకు మంజూరు చేయడం లేదని ప్రశ్నించారు. సమాచారం లేని కారణంగా ఇల్లెందు నాలుగో వార్డులో గ్రామసభ వెలవెలబోయింది. అర్హత కలిగిన ప్రజలకు పథకాల జాబితాలో ఎందుకు చోటు కల్పించలేదంటూ ఖమ్మం రూరల్ మండలం మద్దులపల్లిలో సీపీఎం, సీపీఐ, బీఆర్ఎస్ నాయకులు ప్రశ్నించారు. గ్రామసభలో అధికారులను నిలదీశారు. భద్రాద్రి జిల్లా పినపాక మండలం తోగ్గూడెం గ్రామసభలోని అధికారులను గ్రామస్తులు అడ్డుకున్నారు. ప్రజల ఆందోళన కారణంగా దమ్మపేట మండలం ఆళ్లపల్లి గ్రామసభ అర్ధాంతరంగా నిలిచిపోయింది. బోనకల్లు మండలం బ్రాహ్మణపల్లిలో అధికారుల తీరును నిరసిస్తూ ప్రజలు ఆందోళన చేపట్టారు. పోలీసులు వచ్చి ఆందోళనకారులను చెదరగొట్టారు. తిరుమలాయపాలెం మండలం పిండిప్రోలు గ్రామసభలో ప్రజలు అధికారులపై తిరుగుబాటు చేశారు. దీంతో అక్కడ గందరగోళ పరిస్థితి నెలకొన్నది. కొణిజర్ల మండలం తీగలబంజర గ్రామంలో తీవ్ర గందరగోళం ఏర్పడింది. ఇంటింటి సర్వే చేయకుండానే లబ్ధిదారుల జాబితా ఎలా తయారు చేశారంటూ ప్రజలు ఆందోళనకు దిగారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ పథకాలు వర్తింపజేయాలని అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. కూసుమంచి మండలం గట్టుసింగారం, మల్లాయిగూడెం, నేలపట్ల, చౌటపల్లి గ్రామసభల్లో కూడా గందరగోళం నెలకొంది. అనర్హులకు జాబితాలో చోటు కల్పించారంటూ అధికారులతో గ్రామస్తులు వాగ్వాదానికి దిగారు.


ఖమ్మం రూరల్: ఆత్మీయ భరోసా పథకానికి తమను ఎందుకు ఎంపికచేయలేదని అధికారులను నిలదీస్తున్న మద్దులపల్లి గ్రామస్తులను వెనక్కు పంపుతున్న పోలీసులు


బోనకల్లు: అర్హులను ఆత్మీయ భరోసా పథకానికి ఎంపికచేయలేదంటూ గ్రామసభలో అధికారులను నిలదీస్తున్న బీఆర్ఎస్, సీపీఎం నాయకులు, కూలీలను వారిస్తున్న పోలీసు

## కాంగ్రెస్ నేతల సూచనలతో అర్హుల గుర్తింపు?

అర్హుల గుర్తింపు కోసం ఏ అధికారీ క్షేత్రస్థాయిలో తన విచక్షణాధికారం మేరకు నిర్ణయాలు తీసుకున్న దాఖలాలు ఎక్కడా కన్పించలేదు. కేవలం తమకే సర్వాధికారాలు ఉన్నట్లుగా గ్రామాల్లో స్థానికంగా ఉండే కాంగ్రెస్ నాయకులు, ఆ పార్టీ ప్రజాప్రతినిధులు వ్యవహరించినట్లు స్పష్టమవుతున్నది. వారి సూచనల మేరకు అర్హులను (కాంగ్రెస్ కార్యకర్తలను) ముందే గుర్తించినట్లు, లబ్ధిదారులు ఎంపిక ఏకపక్షంగా జరిగిపోయినట్లు జాబితాలను పరిశీలిస్తే తేటతెల్లమవుతోంది. అందుకే గ్రామసభల్లో ప్రజలందరూ అధికారులను నిలదీశారు. తమకు అన్ని అర్హతలూ ఉన్నప్పటికీ, ఇప్పటికే రెండుమూడుసార్లు దరఖాస్తు చేసుకున్నప్పటికీ తమను ఎందుకు అర్హులుగా గుర్తించలేదని ప్రశ్నించారు. ఎన్నో ఆశలతో వచ్చిన ప్రజలు కూడా ప్రభుత్వాన్ని తిట్టుకుంటూ ఇంటి ముఖం పట్టారు. అయితే మరోసారి దరఖాస్తు చేసుకోవాలంటూ అధికారులు దాటవేశారు.


ముదిగొండ: అర్హులకు ఎందుకివ్వట్లేదంటూ గ్రామసభలో అధికారులను నిలదీస్తున్న మహిళ

### నాకు ఏ పథకం రాలేదు..

నాకు సెంటు భూమి లేదు. ఇల్లు లేదు. కానీ.. నన్ను ఏ పథకంలో లబ్ధిదారుడిగా ఎంపిక చేయలేదు. ఇందిరమ్మ ఇల్లు, ఇందిరమ్మ భరోసా కోసం దరఖాస్తు చేసుకున్నా. రేషన్ కార్డులో మా పిల్లల పేర్లు ఎక్కించేందుకూ దరఖాస్తు పెట్టుకున్నా ఎలాంటి ఫలితం లేదు. మేము ఒకే ఇంట్లో రెండు మూడు కుటుంబాలు ఉంటున్నాం. ఈసారి నాకు ఇల్లు వస్తుందని సంతోషపడ్డా. గ్రామసభలో నా పేరు రాలేదని చెప్పారు. ఇందులో ఏదో మతలబు ఉంది. అందుకే నా పేరు రాలేదు.



**–వరికొప్పుల సురేశ్, మేడేపల్లి, ముదిగొండ మండలం**

### అర్హులెవరో అనర్హులెవరో అధికారులకు తెలియదా?

మా గ్రామంలో అర్హులెవరో, అనర్హులెవరో అధికారులైన మీకు తెలియదా? గ్రామసభలో పేర్లు చదివేదాకా అర్హులెవరో మీరు గుర్తించలేకపోయారా? అలాంటప్పుడు ఈ గ్రామసభ ఎందుకు? అసలు ఇవేం గ్రామసభలు? ఇళ్లు ఉన్నవాళ్లకే ఇళ్లు ఇస్తున్నారు. ఇంటి స్థలం ఉన్న చాలామందికి ఇళ్లు రావడం లేదు. అందరికీ న్యాయం చేయాలి. ఉన్నోడికో న్యాయం లేనోడికో న్యాయం చేస్తారా? రెండో జాబితాలో కూడా నిజమైన అర్హుల పేర్లు లేకపోతే ఆఫీసు ముందు ధర్నా చేస్తాం.



**–రమాకాంత్, ఎన్‌కే నగర్ గ్రామస్తుడు, చుంచుపల్లి**

### జాబ్ కార్డు ఉన్నా అనర్హురాలినట..

నేను 2023–24 సంవత్సరానికి గాను 23 రోజులపాటు ఉపాధిహామీ పనులు చేసినట్లు జాబ్ కార్డు ఉంది. అయినప్పటికీ అధికారులు ఆత్మీయ భరోసాకు అనర్హురాలిని అంటూ అధికారులు ప్రకటించారు. ప్రస్తుతానికి నేను ఉండే ఇల్లు కూలిపోయే స్థితిలో ఉంది. నాకు సెంటు భూమి కూడా లేదు. గ్రామసభలో అధికారులు తనను అనర్హురాలిగా ఎలా ప్రకటించారు. ఇది మీకు న్యాయం కాదు.



**–గురినూరి కమలమ్మ, డబ్ల్యూ రేగుబల్లి, దుమ్ముగూడెం మండలం**

### పేదరికంలో ఉన్నా కనికరించలేదు..

కటిక పేదరికంలో ఉన్నా అధికారులు కనికరించలేదు. ఉపాధి కార్డు ఉంది. నా పుస్తకం చూస్తే అర్థమవుతుంది. అటు ఇంటి జాబితాలో, ఆత్మీయ భరోసాలో సైతం నా పేరు రాలేదు. అధికారుల ముందు ఎంత అరిచి గీపెట్టినా ఎవరూ హామీ ఇవ్వలేదు. నా కొడుకు గ్రామసభలో మరోసారి ఈరోజు దరఖాస్తు ఇచ్చాడు. అధికారులు పేదోళ్లకు న్యాయం చేయాలి. ఆఫీసులో కూర్చొని పేదలు ఎవరో వాళ్లే రాసుకొని రావడం మంచి పద్ధతి కాదు.



**–బొడ్డు జానకమ్మ, మద్దులపల్లి, ఖమ్మం రూరల్ మండలం**

### సీనియర్ మేట్‌నైనా అన్యాయం చేశారు..

వంద రోజుల పని పుట్టిన నాటి నుంచి ఇప్పటివరకు పనికి పోతూనే ఉన్నా. గతంలో ఇందిరమ్మ ఇల్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు దరఖాస్తు చేసుకున్నా. ఈరోజు మా ఊర్లో జరిగిన గ్రామసభ లిస్టులో నాపేరు రాలేదు. ఎందుకు రాలేదు అని అడిగితే.. ఎవరూ కచ్చితంగా జవాబు చెప్పలేదు. మా ఊర్లో సీనియర్ మేట్‌ను కూడా. నా భర్త చనిపోయాడు. పుట్టెడు కష్టాల్లో ఉన్న నాకు న్యాయం చేయాలి. ఈ పథకానికి నేను కచ్చితంగా అర్హురాలిని.



**–కొప్పుల సంతోషమ్మ, మద్దులపల్లి, ఖమ్మం రూరల్ మండలం**

# స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

**బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు**


సమావేశంలో మాట్లాడుతున్న రేగా కాంతారావు

మణుగూరు టౌన్, జనవరి 21: త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పని చేయాలని, ఇందుకోసం ఇప్పటినుంచే శ్రమించాలని బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు పిలుపునిచ్చారు. సమితిసింగారం పంచాయతీ జనరల్ బాడీ సమావేశం అశోక్‌నగర్‌లోని గంజి నరేందర్ ఇంటి వద్ద మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో సమితిసింగారం పంచాయతీని అన్ని విధాలా అభివృద్ధి చేశానని గుర్తు చేశారు. అధిక నిధులు వెచ్చించి సెంట్రల్ లైటింగ్, పలు వీధులలో సిమెంట్ రోడ్లు, మౌలిక వసతులు అన్ని కల్పించామన్నారు. ఈ అభివృద్ధిని ప్రజలకు వివరిస్తూ స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపునకు అందరూ పాటుపడాలన్నారు. అందరూ సమన్వయంతో పనిచేస్తే విజయం మనదే అవుతుందన్నారు. సమావేశంలో మండల పార్టీ కన్వీనర్ కుర్రి నాగేశ్వరరావు, పట్టణ కన్వీనర్ కుంట లక్ష్మణ్, మాజీ జడ్పీటీసీ పోచం నరసింహారావు, బులిశెట్టి నవీన్, నూకారపు రమేశ్, వట్టం రాంబాబు, ఆవుల నరసింహారావు, ముద్దంగుల కృష్ణ, అక్కి నరసింహారావు, ఎడవల్లి వెంకటయ్య, బేగ రమ్య, ముద్దుల ప్రసాద్, బర్మావత్ నరసింహారావు, వెంకటసోములు, కంభంపాటి ఉపేంద్ర, బోడా బీరమ్మ, గాజుల నరేశ్, గంజి నరేందర్, కర్ల వెంకన్న, సుతారి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# ప్రశ్నించే వారిపై కక్షపూరిత కేసులు

- జిల్లా నుంచి ముగ్గురు మంత్రులున్నా ఉపయోగం లేదు
- రాజ్యాంగేతర శక్తులుగా మల్లు నందిని, దయాకర్‌రెడ్డి
- కమీషన్ల కోసమే సీతారామకు అదనపు కేటాయింపులు: ఎమ్మెల్సీ తాతా మధు
- ప్రతీ నిరుపేదకు ప్రభుత్వ పథకాలు అందించాలి: మాజీ ఎమ్మెల్యే సండ్ర


సమావేశంలో మాట్లాడుతున్న తాతా మధు, పక్కన మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

ఖమ్మం, జనవరి 21: అబద్ధపు పునాదుల మీద అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామిక హక్కులను కాలరాస్తున్నదని, ప్రశ్నించే వారిపై కక్షపూరితంగా వ్యవహరిస్తూ అక్రమ కేసులు పెడుతున్నదని బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు ఆరోపించారు. ఇందులో కొందరు అధికారులు కాంగ్రెస్ నాయకులుగా వ్యవహరిస్తున్నారని, భవిష్యత్‌లో వారు తగిన మూల్యం చెల్లించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఖమ్మం నగరంలోని తెలంగాణ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య తదితర నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ రోజులను సీఎం రేవంత్‌రెడ్డి తలపిస్తున్నారని, జిల్లా నుంచి ముగ్గురు మంత్రులున్నా ఎలాంటి ఉపయోగం లేదన్నారు. రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి సోదరులు, ఖమ్మం జిల్లాలో మల్లు నందిని, దయాకర్‌రెడ్డిలు రాజ్యాంగేతర శక్తులుగా పని చేస్తున్నారని ఆరోపించారు. జూలూరుపాడు నుంచి ఏన్కూరు వరకు లింక్ కెనాల్‌ను మాత్రం రూ.200 కోట్లతో పూర్తి చేశారని, ఇందులో 8 నుంచి 12 శాతం కమీషన్లు దండుకున్నారని ఆరోపించారు. అలాగే రూ.13 వేల కోట్లతో సీతారామ ప్రాజెక్టు పనులు మొదలుపెట్టి మేజర్ కాల్వలు, ఇతరత్రా పనులు 90 శాతం పూర్తయితే.. కాంగ్రెస్ ప్రభుత్వం రూ.900 కోట్లకు అదనంగా ప్రతిపాదనలు సిద్ధం చేయడం వెనుక ఉన్న మతలబు ఏమిటో నీటిపారుదల శాఖ మంత్రి సమాధానం చెప్పాలని తాతా మధు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కమీషన్ల పేరుతో దండుకోవడానికి సీఎం గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని అన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడుతానని చెప్పిన రేవంత్ మైలారం ప్రజలకు మద్దతు ఇచ్చిన హక్కుల నేత హరగోపాల్‌ను అరెస్ట్ చేయడం అన్యాయమన్నారు. కేటీఆర్, హరీశ్‌రావులను అరెస్ట్ చేస్తే బీఆర్ఎస్‌ను లేకుండా చేయాలని రేవంత్‌రెడ్డి పగటి కలలు కంటున్నాడని, ఇవేవీ నెరవేరవన్నారు. పొంగులేటి అవినీతి గురించి సాక్షాత్తు కాంగ్రెస్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న చేసిన వ్యాఖ్యలను తాతా మధు ప్రదర్శించారు. మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య మాట్లాడుతూ ప్రజాపాలనలో పలు పథకాలకు దరఖాస్తులు స్వీకరించిన ప్రభుత్వం మళ్లీ గ్రామసభల పేరుతో దరఖాస్తులు స్వీకరించడం ఏమిటని ప్రశ్నించారు. రేషన్ కార్డుల జాబితాను విడుదల చేసిన ప్రభుత్వం అర్హులకు ఇవ్వకుండా అనర్హులకు ఇస్తున్నదని, కాంగ్రెస్ నాయకులు చెప్పిన వారికే ఇచ్చినప్పుడు ఇక గ్రామసభలు ఎందుకని ప్రశ్నించారు. ప్రతి పేదవారికి అన్ని సంక్షేమ పథకాలు అందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, సీనియర్ నాయకులు ఆర్జేసీ కృష్ణ, బొమ్మెర రామ్మూర్తి, శీలంశెట్టి వీరభద్రం, బల్లెం వేణుగోపాల్, ఖమర్ తదితరులు పాల్గొన్నారు.